క్లుప్తంగా

తగ్గిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆదాయం



నేమకల్లు ఆలయంలో హుండీకానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి హుండీ ఆదాయం తగ్గింది. గురువారం కణేకల్లు, ఉరవకొండ దేవదాయశాఖ ఈవోలు దేవదాసు, విజయ్‌కుమార్ పర్యవేక్షణలో హుండీ కానుకలను ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులు లెక్కించినట్లు ఆలయ ఈవో నరసింహారెడ్డి తెలిపారు. హుండీ ఆదాయం రూ.15,14,869 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది రూ. 15,37,990 రాగా ఈ ఏడాది రూ.23,094 హుండీ ఆదాయం తగ్గినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డి.హీరేహాళ్ ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మైనర్ ఇరిగేషన్ సెన్సస్ సర్వే పూర్తి చేయండి



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

రాయదుర్గంటౌన్: మండలంలో నెలరోజుల్లోపు ఏడో మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ నాగరాజు, ఏఎస్‌ఓ కృష్ణయ్య ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ సర్వేపై వీఆర్వోలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. 74 ఉడేగోళంలో క్షేత్ర స్థాయిలో వీఆర్వోలకు అవగాహన కల్పించారు.

ఐదోరోజూ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు నాగరాజు

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం ఐదోరోజూ కొనసాగింది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు నాగరాజు హాజరై సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, బసప్ప, ఇస్మాయిల్, రాము, శివమ్మ, రహంతుల్లా, శీనప్ప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

వజ్రకరూరు: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ బీఎన్ శ్రీదేవి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో సీడీపీఓ శ్రీదేవి పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హసీనా బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాగునీటి పథకాల వివరాలు పక్కాగా సేకరించండి



సాగునీటి పథకాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్‌ఓ సాంబశివుడు

కణేకల్లు: సాగునీటి పథకాల వివరాలు పక్కాగా సేకరించాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ సాంబశివుడు ఆదేశించారు.గురువారం 7వ చిన్న తరహా సాగునీటి పథకాల గణనపై వీఆర్వోలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ జరిగింది. శిక్షణ తర్వాత క్షేత్రస్థాయిలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఎస్‌ఓ హేమలతతో కలిసి పథకాలగణపై అవగాహన కల్పించారు. చెరువులు, పర్క్యులేషన్ ట్యాంకులు, చిన్న, చిన్న కుంటలతోపాటు బోర్లు ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయో వివరాలు సేకరించాలన్నారు. రైతుల బోర్లు పట్టా భూముల తోపాటు ప్రభుత్వ భూముల్లో ఉంటే వాటి వివరాలు సేకరించాలన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో?

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, వితంతువులు
- ఏడాదైనా మొదలుకాని దరఖాస్తుల స్వీకరణ
- వితంతు పింఛన్ల మంజూరులోనూ మెలిక



ఉరవకొండ సచివాలయం వద్ద కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చి సైట్ పనిచేయకపోవడంతో నిరాశగా వెనుతిరుగుతున్న దివ్యాంగుడు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయినా నేటికీ ఏ ఒక్క సంక్షేమ పథకమూ సమర్థంగా అమలు చేసిన దాఖలాలులేవు. చివరకు వృద్ధులు, వితంతవులకు కూడా పింఛన్లు మంజూరు చేయలేదు. దీంతో పలువురు అర్హులు ఇంకెప్పుడు పంఛన్ ఇస్తారని సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరీలో పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండి చేయి చూపుతున్నారు.

ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో కొత్త పింఛన్ల కోసం అర్హులందరూ దరఖాస్తులు చేతపట్టుకొని సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఐదు మండలాల పరిధిలో 6,400 వరకు అర్హులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా కొత్త పింఛన్ కోసం ఎలాంటి మార్గదర్శకాలూ విడుదల చేయలేదు. ఇప్పటి వరకు దీనికి సంబంధించి సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్‌లు మంజూరయ్యేవి. ఈప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నాటి పరిస్థితి కూటమి ప్రభుత్వంలో లేదు. ఆన్‌లైన్‌లో సైట్ కూడా కనిపించకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వలంటీర్లు ఇంటి వద్దే పింఛన్లు అందించేవారు. దరఖాస్తులు కూడా స్వీకరించేవారు. భర్త చనిపోతే నెల లోపే వితంతు పింఛన్‌లు మంజూరయ్యేవి. ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు మంజూరుకు అప్పటి జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొత్త పింఛన్‌ల కోసం వందల సంఖ్యలో అర్జీలు అందిస్తున్నారు.

కుటుంబం గడవక అవస్థలు



అనారోగ్యంతో భర్త చనిపోయాడు. కుటుంబం గడవక ఏడాదిగా అవస్థలు పడుతున్నా. పిల్లల పోషణ భారంగా మారుతుంది. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. నా భర్తకు కూడా పింఛన్ వచ్చేది కాదు. ప్రస్తుతం పింఛన్ అర్జీ తీసుకొని సచివాలయానికి పోతే ఇంకా సైట్ ఓపెన్ కాలేదని చెప్తున్నారు.

– గౌరమ్మ, విడపనకల్లు

పింఛన్ ఇవ్వండి



కొత్త పింఛన్ కోసం ఎన్నో సార్లు అర్జీలు ఇచ్చి అలసిపోయా. వృద్ధాప్య పింఛన్ కోసం అర్హత ఉన్నా ఇంకా కొత్త పింఛన్ ఇవ్వడం లేదు. ఏ పని చేయడానికి కూడా చేత కావడంలేదు. పింఛన్ అందిస్తే ఆసరాగా ఉంటుంది.

– నారాయణమ్మ, ఉరవకొండ

సైట్ ఓపెన్ కాలేదు



సామాజిక పింఛన్‌దారుడు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే కొత్త పింఛన్ల దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా సైట్ ఓపెన్ కాలేదు. అర్జీదారులకు సైట్ ప్రారంభం కాగానే ప్రకటన చేస్తాం.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

కారంచేడు ఘటన నేటికీ మాయని గాయం



ఉరవకొండ క్లాక్‌టవర్ వద్ద కారంచేడు ఘటనలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉరవకొండ: కారంచేడు మృతవీరులకు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గురువారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రాయుడు, రాయంపల్లి సోము, రాజుశేఖర్, వెలిగొండ ఓబన్న, పాల్తూరు ఆనంద్, బండారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కారంచేడు ఘటన నేటికీ మాయని గాయమని దళిత సంఘాల నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రజాసంఘాల నాయకులు కారంచేడు మృతవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, దళిత నాయకులు, నాగరాజు, వెంకటేశులు, పరమేశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయండి

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలని ఆర్టీసీ రాయలసీమ జోన్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ (సీఓఎస్) కె.హరి ఆదేశించారు. గురువారం రాయదుర్గం ఏపీఎస్ ఆర్టీసీ డిపోను ఆర్టీసీ రాయలసీమ జోన్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ (సీఓఎస్) కె.హరి తనిఖీ చేశారు. స్థానిక డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో కలిసి కార్మికులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు స్టోర్, ఆఫీస్ సెక్షన్, డిపోలోని బస్సులు, గ్యారేజీలోని బస్సుల కండిషన్లు, సర్వీసు ఆపరేషన్ పరిస్థితులను తనిఖీ చేశారు. బస్సుల నిర్వహణలో, బస్సులు నడపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

మందుల మాఫియా

- వైద్యులు రాసేదొకటి.. దుకాణాల్లో ఇచ్చేది మరొకటి
- విచ్చలవిడిగా మార్కెట్లోకి కంపెనీ శాంపిళ్లు
- కాంబినేషన్ మందులు కొన్నా జబ్బు నయం కాక ఇబ్బందులు

రాయదుర్గం: చెవిలో దురద పుట్టడంతో (స్కిన్ అలర్జీ) వైద్యుడు రాసిచ్చిన చీటి తీసుకుని పట్టణంలోని ఓ మెడికల్ దుకాణం వద్దకు వ్యక్తి వెళ్లాడు. ఈ మందైతే తన వద్ద లేదు, సేమ్ కాంబినేష్ దానికంటే మెరుగ్గా పనిచేసే అయిట్‌మెంట్ ఉందని అంటగట్టాడు. వైద్యుడు వద్దన్నందుకు మళ్లీ దాన్ని దుకాణంలో తిరిగిచ్చాడు. చాలా చోట్ల ఇలాంటి పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. ఇలా అనేక రకాల మందులు మార్చి ఇస్తున్నట్టు రోగులు, వారి బంధువుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఔషధ దుకాణాల్లో మెడికల్ మాఫియా రోజుకో దందా వెలుగుచూస్తోంది. వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా కొన్నిచోట్ల మందులు విక్రయిస్తే, మరిన్ని దుకాణాల్లో వైద్యుల చీటీలు తీసుకెళ్లినా, కాంబినేషన్ పేరుతో కొత్తరకం మందులు అంటగడుతున్నారు. ఇలా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు సాగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. శాంపిల్స్ తరహా నంబర్–2 మందులు విక్రయిస్తునట్లు ప్రచారం సాగుతోంది. చిన్న, పెద్దవి సుమారు 162 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 80 శాతం దుకాణాల్లో ఫార్మసిస్టు లేకుండానే మందులు అమ్ముతున్నారు. టెన్త్, డిగ్రీ చదివినవారే ఎక్కువ శాతం మెడికల్ దుకాణాల్లో మందులు ఇస్తున్నారు. జ్వరం, జలుబు, తలనొప్పి, చిన్న పిల్లలకు సంబంధించిన టానిక్‌లు, యాంటీబయోటిక్స్ విక్రయాల్లో ఎక్కువ లాభాలు ఉంటున్నాయి. ఏదైనా అనారోగ్య సమస్య చెప్తే .. అవసరం లేని ఒకే తరహా మందులను అంటగడుతున్నట్టు ప్రజలు చెప్తున్నారు. ప్రచారం కోసం మెడికల్ కంపెనీలు కొన్ని శాంపిల్స్ మందులను మెడికల్ రెప్‌ల ద్వారా డాక్టర్లు, మెడికల్ షాపులకు పంపిస్తున్నారు. శాంపిల్స్ మందులు కేవలం వైద్యులు వారి వద్దకు వచ్చే రోగులకు మాత్రమే ఇవ్వాలి. వీటిని అమ్మితే లైసెన్సులు రద్దుచేయడంతో పాటు దుకాణాన్ని సీజ్‌చేసే అవకాశం ఉన్నా.. తనిఖీలు లేవు. డ్రగ్స్ అధికారులు వీటిపై దృష్టి సారించి, ప్రజలు ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు నిర్వహిస్తాం

వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతాం. కొత్త రకం కాంబినేష్ మందులు ఇచ్చే ప్రయత్నం చేస్తే, లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తాం. ప్రభుత్వ నిబంధనలకు లోబడే మెడికల్ దుకాణాలు నిర్వహించాలి. శాంపిల్స్ మందులు విక్రయించరాదు.

– మాధవి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం

ఆర్డీటీ పరిరక్షణకు పోస్టుకార్డు ఉద్యమం



శెట్టూరులో పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు,ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: ఆర్‌డీటీకు ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించే వరకు ఉద్యమం సాగుతుందని దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపకుడు మీనుగ గోపాల్ అన్నారు. ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని లత్తవరం, షేక్షానుపల్లి, రాచేపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం 600కు పైగా పోస్టుకార్డులు రాయించి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పంపనున్నారు.

శెట్టూరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులు పోస్ట్ కార్డుల ఉద్యమం గురువారం నిర్వహించారు. ఆర్డీటీ అనుమతులు పునరుద్ధరణ చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు పోస్ట్ కార్డులు రాసి పంపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, దళిత నాయకులు టైలర్ వన్నూరుస్వామి, బాబురావు, గౌరయ్య, లింగప్ప, సీబీటీలు వన్నూరుస్వామి పాల్గొన్నారు.

అర్హత ఉన్నా అందని ‘తల్లికి వందనం’



న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్న గంగాధర్, తిప్పమ్మ దంపతులు

రాయదుర్గంటౌన్: అన్ని రకాలుగా అర్హత ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో ఓ కుటుంబం తల్లికి వందనం పథకం వర్తించలేదు. బాధిత కుటుంబానికి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ధర్మవరంలో పనిచేసే ఓ ఉద్యోగి పేరు ట్యాగ్ అయ్యింది. ఈ కారణంతో పథకం వర్తించలేదని అధికారులు చెప్తున్నారు.

వివరాలు.. జుంజురాంపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గంగాధర్‌కు భార్య తిప్పమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే ముగ్గురు పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. తల్లికి వందన పథకం రాకపోవడంతో తాను స్థానిక సచివాలయంలో విచారిస్తే మీ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఉద్యోగి పేరిట చూపిస్తుండడంతో పథకం వర్తించలేదన్నారు. సదరు ఉద్యోగిగా వచ్చిన వ్యక్తితో తమకు ఎలాంటి సంబంధం లేదని, న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఇదే విషయాన్ని ఎంపీడీవోను కలిసి తెలియజేస్తే డీసీఓను సంప్రదించాలని సలహా ఇచ్చారని, అక్కడికెళ్లి విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది. న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కలెక్టర్లను విన్నవిస్తూ ఆ కుటుంబం విడుదల చేసిన వీడియో వైరల్ అయ్యింది.

కొనకొండ్లలో ప్రబలిన జ్వరాలు

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలోని పలు కాలనీల్లో జ్వరాలు ప్రబలాయి. టైఫాయిడ్, ఒళ్లనొప్పులు, తలనొప్పి, జలుబు తదితర వాటితో గ్రామస్తులు బాధపడుతున్నారు. గురువారం గ్రామానికి చెందిన జ్వరబాధితులు స్థానిక సీహెచ్‌సీ వెళ్లి చికిత్స చేయించుకున్నారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల రోగులు కూడా భారీగా కొనకొండ్ల ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచండి

కూడేరు: ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు సమష్టిగా పని చేసి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి ఆదేశించారు. గురువారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి ఉపాధి సిబ్బందితో పనుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. రోజూ 1,500 మంది కూలీలకు పని కల్పించేలా లక్ష్యం ఉందని, పనుల కల్పనలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తివేయాలి

కూడేరు: ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తేయాలని పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్నట్లు ఆర్డీటీ అభిమాన సంఘం జిల్లా నాయకులు లక్ష్మన్న, సంజీవరాయుడు, అక్కమ్మ, ముత్యాలు తెలిపారు. గురువారం కూడేరులోని హైస్కూల్, కేజీబీవీలో ఆర్డీటీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులతో పోస్టు కార్డులు రాయించారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: కూడేరు మండలానికి యూనిట్లు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆరు సబ్సిడీ (50 శాతం) మంజూరయినట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లింలు (బీసీ–ఈ), దూదేకుల అభ్యర్థులు అర్హులన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి నుంచి పోలేపల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సురేంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు నిధులతో రూ.1.20 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చౌకధాన్యపు డిపో తనిఖీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులోని 22వ నంబర్ చౌకధాన్యపు డిపోను తహసీల్దార్ నాగరాజు, సీఎస్‌డీటీ శ్యామ్‌రాయ్ గురువారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ చేసిన సరుకులకు క్షేత్ర స్థాయి నిల్వను పరిశీలించినట్లు చెప్పారు.

కొనకొండ్ల గ్రంథాలయాధికారిగా వన్నూరుస్వామి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రంథాలయ అధికారిగా టి.వన్నూరుస్వామిని నియమించారు. ఇక్కడ పని చేస్తున్న గ్రంథాలయ అధికారి ఆదిలక్ష్మి గుంతకల్లు గ్రంథాలయానికి బదిలీ అయ్యారు. కణేకల్లు మండలంలో పనిచేస్తున్న గ్రంథాలయాధికారి వన్నూరుస్వామి ఇక్కడికి బదిలీ అయ్యారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వజ్రకరూరు: మండల పరిధిలోని వెంకటాంపల్లిపెద్దతండా గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్‌ఐ నాగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడులు చేశారు. పేకాటరాయుళ్లు విజయ్‌కుమార్ నాయక్, మోతిలాల్‌నాయక్, మోహన్‌నాయక్, బొజ్జనాయక్ తదితరులను అరెస్ట్ చేసి, ఈదాడుల్లో రూ.10250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

కణేకల్లు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఐచర్ వాహనం, మూడు బైక్‌ల సీజ్

కణేకల్లు: రికార్డులు లేకుండా నడుపుతున్న ఐచర్ వాహనం, మూడు బైక్‌లను రాయదుర్గం వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి గురువారం సీజ్ చేశారు. కణేకల్లులో ఆయన వాహనాలను తనిఖీ చేశారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

శెట్టూరు: మండల పరిధిలోని చింతర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త దాసరి తిమ్మక్క (75)అనారోగ్యంతో మృతి చెందారు. తిమ్మక్క మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, శెట్టూరు తిప్పేస్వామి, బాబు, గనేష్, మూర్తి, కరియన్న, బాబురావు, గౌరయ్య, మాలింగ, గోవిందప్ప పాల్గొన్నారు.

ఆలయ పూజారి మృతి



సత్యనారాయణ స్వామి (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పూజారి సత్యనారాయణస్వామి (80) మృతి చెందాడు. ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కిందపడ్డాడు. 45 ఏళ్లుగా ఆలయ పూజారిగా సేవలందిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం శంకరప్ప మృతి



హెచ్‌ఎం సురేశంకరప్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో నివాసం ఉంటున్న సీనియర్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సురే శంకరప్ప (84) గురువారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయన పట్టణంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. స్వకులసాలి సామాజిక వర్గానికి చెందిన ఈయన ప్రధాన కార్యదర్శిగా, విద్యావర్ధక సంఘం కార్యదర్శిగా సేవలించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు



బళ్లారి రోడ్డులో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం



ఏడో వార్డులోని కూడలి మధ్యలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా, 7వ వార్డులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. బళ్లారి రోడ్డులోని విద్యుత్ స్తంభం కిందకు వాలి కూలేందుకు సిద్ధంగా ప్రమాదకరంగా ఉంది. 7వ వార్డులో పీర్ల చావిడి వెనుక రోడ్డులో ఓ స్తంభం రోడ్డు మధ్యన ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ స్తంభం ఉన్న ప్రాంతం నాలుగు రోడ్ల కూడలి ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారింది.

ప్రభుత్వ ఖాజీగా మహమ్మద్ ఖాజింబాషా ఖాద్రీ



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రభుత్వ ఖాజీ

కణేకల్లు: కణేకల్లు మండల ప్రభుత్వ ఖాజీగా సయ్యద్ మహమ్మద్ ఖాజీం భాషా ఖాద్రీని ప్రభుత్వం నిమించింది. ఎస్.ఎం.ఖాజీంభాషా ఖాద్రీని నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

బొమ్మనహాళ్: మండలంలోని ప్రగతి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాలు మరింత ఆర్థికవృద్ధి సాధించాలని ఎకాలజీ విభాగం సీబీఓ కోఆర్డినేటర్ భాస్కర్‌బాబు, ఎఫ్‌టీఓ మేనేజర్ రమేష్ తెలిపారు. గురువారం వెంకటాద్రిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రగతి రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నాల్గో వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. సీబీఓ, ఎఫ్‌పీఓ మేనేజర్‌లు పాల్గొన్నారు. తొలుతగా ప్రగతి సంఘ పాలక వర్గాల సభ్యులు రైతు సంఘ ఉత్పత్తిదారు వాటాదారులతో కలసి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంటీఎల్ భవాని, సీఈఓ హరీష్ బీఓడీ సభ్యులు, రైతులు, మహిళా రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న మొహర్రం పండుగ



గుమ్మఘట్టలో కొలువుదీరిన పీర్లు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట గ్రామాల్లో చిన్న పీర్లస్వాముల మొహర్రం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో పీర్ల చావిడిలో పీర్లస్వాములను కొలువుదీర్చారు. పీర్ల స్వాములకు చక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, హారతులు ఇచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం, రాత్రి శేజ్‌హారతి వైభవంగా నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010567770, 9912220732